సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



ఏఎఫ్‌యూలో ఆందోళన
వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ముందస్తు సమాచారం లేకుండా ఎగ్జామినేషన్ నిర్వహించారని విద్యార్థులు ఆందోళన చేశారు. -8లో



ఫుడ్ టెక్నాలజీతో అపార అవకాశాలు
బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ మాధవ తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.0/27.6

వాతావరణం
జిల్లాలో శనివారం 27.6 - 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రైతు ఖాతాలకు నగదు జమ
కడప అగ్రికల్చర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల నిధులు శనివారం రైతు ఖాతాలకు జమ అయ్యింది. జిల్లా వ్యాప్తంగా పీఎం కిసాన్ రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ రూ.5 వేలు ఇలా మొత్తంగా రెండు పథకాలకు సంబంధించి 2025–26వ ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతలో భాగంగా 1,94,047 మంది రైతులకు రూ.132.93 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. ఈ నిధుల రాకతో అన్నదాతలకు పంటల సాగుకు కాసింత ఆర్థిక చేయూత లభించింది.

డిప్లొమో ప్రవేశాల గడువు పొడిగింపు
కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమో కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల పంచాలకులు టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో నేరుగా విశ్వవిద్యాలయంలో హాజరు కావాలని సూచించారు. సాయంకాల తరగతులు కావడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఇతర వృత్తుల్లో ఉన్నవారు, పీజీ స్థాయి కోర్సులు చదువుతున్న వారు కూడా ఇందులో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు యోగి వేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.yvu.edu.inను సందర్శించాలని సూచించారు.

5న గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి ఇంటర్వ్యూలు
కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీ పీజీ కళాశాలలోని ఎంబీఏ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్ అలైడ్ బ్రాంచెస్), ఎంసీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) అర్హతలు కలిగి ఉండాలన్నారు. ఎంబీఏ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ పేపర్లు, అలాగే అనుబంధ అంశాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ప్రోగ్రామింగ్ ఇన్ ఆర్, మిషన్ లెర్నింగ్, ఐటీటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా వేరు హౌసింగ్ అండ్ మైనింగ్, బిజినెస్ అనలిటిక్స్, టాబ్ల్యూ, పవర్ బీ ఐ, డీజీఎంఎస్, డేటా విజువలైజేషన్‌లలో బోధించే వారు కావాలన్నారు. అర్హత ప్రమాణాలు ఉన్న అభ్యర్థులు బయో–డేటా అలానే సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో నేరుగా ప్రిన్సిపల్ కార్యాలయంలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు www.yvu.edu.in వెబ్సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

అన్నదాతల పంటల సాగుకు చేయూత




పీఎం కిసాన్ నిధుల మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న అధికారులు

కడప అగ్రికల్చర్: అన్నదాతల పంటల సాగుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తోందని కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత నిధులు రైతుల ఖాతాలోకి రూ. 2 వేల నగదు జమకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ యూపీలోని వారణాసిలో ప్రారంభించిన ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం శనివారం కేవీకేలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాతలకు ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని 2019 ఫిబ్రవరి 2వ తేదీ నుంచి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్ కింద ఏటా రైతులకు రూ.6 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. కడప ఏడీఏ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో 1576 మంది రైతులకు 19 లక్షలు పీఎం కిసాన్ డబ్బులు రైతు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్ర సమన్వయకర్త అంకయ్యకుమార్, ఆత్మ పీడీ విజయలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్ బాబు, మానస, సురేస్‌రెడ్డి, గిరీష్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ విద్య.. ఇక మిథ్య

వైద్య రంగం పట్ల కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. దీంతో ఇప్పటికే మంజూరైన కాలేజీలు కనుమరుగయ్యాయి. కేటాయించిన సీట్లు వెనక్కు వెళ్లాయి. ఇప్పుడు ప్రభుత్వ హోమియోపతి వైద్య రంగం కూడా అచేతనంగా మారింది. తాజాగా కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీకి పీజీ సీట్లను ఒక్కటి కూడా.. కేటాయించకపోవడంతో దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.





కడపలోని ప్రభుత్వ హోమియోపతి కాలేజీ

- కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీపై శీతకన్ను
- పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు కేటాయించని కౌన్సిల్
- పట్టించుకోని పాలకులు

ప్రభుత్వ హోమియోపతి కాలేజీలకు పీజీ సీట్ల కేటాయింపుల వివరాలు

సంవత్సరం	2024		2025	
	యూజీ	పీజీ	యూజీ	పీజీ
కడప	38	08	38	–
గుడివాడ	50	24	50	12
రాజమండ్రి	60	24	50	–

కడప రూరల్: ప్రభుత్వ హోమియోపతి కాలేజీలు కడపతోపాటు గుడివాడ, రాజమండ్రిలో మాత్రమే ఉన్నాయి. పాలకుల నుంచి ఆలన..పాలన లేకపోవడంతో ఈ కాలేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా ఈ వైద్య రంగంలో విద్యను అభ్యసించే వారికి కష్టతరంగా మారింది.

'యూజీ'లకు తీవ్ర నష్టం

డాక్టర్‌గా సేవలు అందించాలనేది బైపీసీ విద్యార్థుల కల. నీట్ పరీక్షలు రాశాక, ర్యాంకులు, ఇతర నిబంధనల మేరకు ప్రాధాన్యత ప్రకారం వరస క్రమంలో మొదటగా ఎంబీబీఎస్ తరువాత బీడీఎస్ (డెంటల్), ఆయుర్వేదం, హోమియోపతి, యూనానిలో సీట్లను కేటాయిస్తారు. కాగా హోమియోపతికి సంబంధించి ప్రభుత్వ కాలేజీలో సీటు వచ్చిన వారు నాలుగున్నరేళ్ల పాటు యూజీ (అండర్ గ్రాడ్యుయేట్), ఒక ఏడాది హౌస్ సర్జన్‌గా చేయాలి. అనంతరం కీలకమైన పీజీ (పోస్టు గ్రాడ్యుయేట్) పూర్తి చేయాలి. ఇది మూడేళ్ల కోర్స్. ఈ కోర్స్‌ను పూర్తి చేసిన వారు మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా లేదా డిస్పెన్సరీల్లో మెడికల్ ఆఫీసర్‌గా చేయడానికి ఆస్కారం ఉంటుంది. పీజీకి అర్హత సాధించాలంటే ఇంకా కష్టపడి చదవాలి. కాగా కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీలో ఏటా 38 మంది విద్యార్థులు యూజీ చేయడానికి అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి వారు కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీకి ఒక్క పీజీ సీటును కూడా కేటాయించకపోవడం దారుణం. గుడివాడ కాలేజీకి మాత్రమే సీట్లను కేటాయించడం గమనార్హం. ఇప్పుడు కడప కాలేజీకి పీజీ సీట్లను కేటాయించకపోవడం వల్ల.. ఇకపై పీజీ సీట్లను కేటాయించరనే వాదన వినిపిస్తోంది. అదే గనుక జరిగితే యూజీ విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని.. ఈ రంగానికి చెందిన ప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు.

పాలకుల నిర్లక్ష్య వైఖరే కారణం
కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య రంగం కకావికలమైంది. ఆ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పులివెందుల వంటి మెడికల్ కాలేజీ కనుమరుగైంది. కేటాయించిన సీట్లు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం జరిగింది. ఇప్పుడు అదే ఒరవడిలో హోమియోపతి వైద్య రంగం కూడా సమస్యలతో సతమతం అవుతోంది. పాలకపక్షం నుంచి కేంద్రంను 'మాకు మెడికల్ కాలేజీలు.. మెడికల్ సీట్లు కావాలి' అని అడిగే వారే కరువయ్యారు. దీంతో వైద్య రంగం పతనావస్థకు చేరిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేటాయింపుల కోసం ప్రయత్నాలు
కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీకి పీజీ సీట్ల కేటాయింపుల అంశానికి సంబంధించి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయుష్ కమిషనర్ దినేష్‌కుమార్ చర్యలు చేపడుతున్నారు.
– డాక్టర్ శోభారాణి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ప్రభుత్వ హోమియోపతి కాలేజీ, కడప

గండి క్షేత్రం.. పోటెత్తిన భక్తజనం

వైభవంగా రెండో శనివారోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీవీరాంజనేయస్వామి

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి క్షేత్రం శనివారం భక్తజనంతో పోటెత్తింది. శ్రావణమాసం రెండో శనివారోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత వారం కంటే ఈసారి భక్తులు సంఖ్య పెరిగిందని ఆలయ వర్గాల అంచనా. ఉదయం నుంచి క్యూలైన్లు మధ్యాహ్నం 3 గంటల వరకు కిక్కిరిశాయి. పలువురు భక్తులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించి తమ మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, అర్చకులు రఘు, సాయిలు ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. గండికి వచ్చిన కొందరు భక్తులు తలనీలాలు ఇచ్చి స్నాన ఘట్టాల వద్ద స్నానం చేసి స్వామిని దర్శనం చేసుకున్నారు. కడప సర్వజన ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చక్రాయపేట ప్రభుత్వ వైద్యశాల తరఫున వైద్య శిబిరం నిర్వహించి అస్వస్థతకు గురైన వారికి సత్వరం చికిత్సలు చేశారు. అయితే వీవీఐపీ క్యూలైన్‌కు తాళం వేసి వాటి తాళాలు ఆలయ సిబ్బంది వద్దనే ఉంచుకొని పలువురు ప్రజాప్రతినిధుల తోపాటు చక్రాయపేట మండల మెజిస్ట్రేట్ విజయకుమారిని సుమారు గంట పాటు కార్యాలయం వాకిట్లోనే నిలబెట్టారు. చివరకు కొందరు పోలీసులు, పాత్రికేయులు గమనించి ఆమెను స్వామి దర్శనానికి పంపారు. ఆలయానికి విరాళం ఇచ్చేందుకు వచ్చిన దాతలను కూడా పట్టించుకోక పోవడంతో కొందరు మండిపడ్డారు. రెండవ శనివారం సుమారు 40 వేల మంది వరకు భక్తులు స్వామిని దర్శించుకొని ఉంటారని ఆలయ వర్గాల అంచనా. కొందరు భక్తులు కాలినడకన వచ్చి స్వామిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ అధికం కావడంతో పోలీసులు వాహనాలను కొద్దిసేపు గండిలోకి అనుమతించ లేదు. ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్సై రగారావు తమ సిబ్బందిచే బందోబస్తు నిర్వహించారు. భక్తుల కాలక్షేపం నిమిత్తం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి.



క్యూలైన్లలో భక్తుల సందడి

పకడ్బందీగా జెడ్పీటీసీ ఉప ఎన్నికలు

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు



మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని బోర్డ్ రూము హాలులో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణపై జెడ్పీ సీఈఓ ఓబులమ్మతో కలిసి డీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో పాటు ఓటర్లు, సాధారణ ప్రజానీకం అందరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను పాటించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పులివెందుల రెవెన్యూ డివిజన్, కడప రెవెన్యూ డివిజన్ అంతటా అమలులో ఉంటుందని తెలిపారు. సెన్సిటివ్, క్రిటికల్, వల్నరబిలిటీ పోలీస్ స్టేషన్లను గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులకు విధులను కేటాయించడం జరిగిందన్నారు. పులివెందుల ఆర్వోగా నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఒంటిమిట్ట ఆర్వోగా డిప్యూటీ కలెక్టర్ రిమ్స్ రంగస్వామిలను నియమించారన్నారు. ఆగస్టు 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తామన్నారు. పులివెందులలో 15 పోలింగ్ స్టేషన్లు 10601 ఓటర్లు, ఒంటిమిట్టలో 30 పోలింగ్ స్టేషన్లు 24606 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు బాబు, డీఎస్పీ వెంకటేశ్వర్లు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్,పులివెందుల ఏఆర్‌ఓ కృష్ణమూర్తి, ఒంటిమిట్ట ఏఆర్‌ఓ సుజాతమ్మ, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన
- అన్నీ సక్రమమే

కడప సెవెన్‌రోడ్స్: ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శనివారం రిటర్నింగ్ అధికారి సి.ఓబులమ్మ సమక్షంలో నిర్వహించారు. నామినేషన్లన్నీ సక్రమంగా ఉన్నట్లు ప్రకటించారు.

- ఒంటిమిట్టకు రాటాల రామయ్య, పూల విజయభాస్కర్, కోనేటి హరి వెంకటరమణ, వై.మధుమూర్తి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, టక్కోలి శివారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి అడ్డలూరు, కడప బాబుసాహెబ్, రేవిళ్ల బాలమునెయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, బొడ్డె వెంకట రమణ, అరిగేల సౌమిత్రి చంద్రనాథ్, గుండు మల్లికార్జునరెడ్డి, దున్నుతల రఘురామిరెడ్డి, వెంకటేశ్ నంద్యాల, ఈశ్వరయ్య తుమ్మలకుంట, వెంకట సుబ్బయ్య ఆలూరు, కుమారి శివరామకృష్ణారెడ్డి, నల్లగొండు వెంకట సుబ్బారెడ్డి, ఇరగంరెడ్డి శ్రీకర్‌రెడ్డి, నడివీధి సుధాకర్ నామినేషన్లు దాఖలు చేశారు.
- పులివెందులకు తుమ్మల హేమంత్‌రెడ్డి, తుమ్మల ఉమాదేవి, మారెడ్డి జయభారత్‌రెడ్డి, అంకిరెడ్డి సురేష్ కుమార్‌రెడ్డి, మారెడ్డి లతారెడ్డి, భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, ముద్దిగారి వెంకగఋరెడ్డి, మొయిళ్ల శివకల్యాణ్ రెడ్డి, యాదటి సునీల్ యాదవ్, నాగేళ్ల సాంబశివారెడ్డి, తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మరుజోల్ల గజేంద్రనాథ్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

రైతులు మార్కెటింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రొద్దుటూరు రూరల్: రైతులు పంటలు పండించడమే కాకుండా ఉత్పత్తి, మార్కెటింగ్ విషయాల్లో జాగ్రత్తలు పాటించినప్పుడే లాభం కలుగుతుందని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. మండలంలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో శనివారం పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు మద్దతుగా వ్యవసాయ, ఉద్యాన శాఖలు, జిల్లా కలెక్టర్‌గా తాను అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే రకాలైన పంటలను రైతులు పండించినప్పుడే వ్యవసాయం నష్టాల బాటలో ఉండదన్నారు. జిల్లాలో రైతుల పంటల సాగుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు. సాగునీరు, ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం పెట్టుబడి నిధులను మంజూరు చేసిందని వివరించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 హామీల్లో మరొక హామీని విజయవంతంగా నెరవేర్చిందన్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఒక్కో రైతుకు రూ.5 వేలు, కేంద్రం ప్రభుత్వం వాటాగా రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మొత్తం 10,326 మంది రైతులకు రూ.7.10 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్, ఏడీఏ అనిత, తహసీల్దార్ గంగయ్య, ఏఓ వరహరికుమార్, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, ఏజీఆర్ బ్యాంక్ చైర్మన్ సిద్ధారెడ్డి నాగమునిరెడ్డి, సర్పంచ్‌లు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, రాజువారి ఆదిలక్షుమ్మ, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాజువారి వెంకటసుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రభుత్వం కుట్ర

- ఇలా పరిపాలించాలని మీరే చూపిస్తున్నారు
- ఇది పర్మినెంట్ ప్రభుత్వం కాదని పోలీసులు, అధికారులు గుర్తుంచుకోవాలి
- అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే పరిణామాలు ఎదుర్కోక తప్పదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 14 నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన మేలు ఏమీ లేదన్నారు. అవినీతికి, దుర్మార్గాలకు ఏపీ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. పోలీసులను ముందుపెట్టి ప్రభుత్వాన్ని నడుపుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'మేము ఇలాగే చేసి ఉంటే చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ యాత్రలు చేసేవారా' అని ప్రశ్నించారు. 'ఎలా పాలించారో మీరే మాకు నేర్పిస్తున్నారు, ఏదైతే విత్తుతున్నారో అదే పెరిగి పెద్దదవుతుంది' అన్నారు. ఇది పర్మినెంట్ ప్రభుత్వం కాదన్న సత్యాన్ని పోలీసులు, అధికారులు గుర్తించాలన్నారు. అలా కాకుండా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే దానికి పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కేసీ కెనాల్‌కు నీరు వచ్చాయని రైతులు పంటలు వేసుకుంటున్న నేపథ్యంలో.. యూరియా కొరత ఏర్పడిందని, సొసైటీల ద్వారా నచ్చిన వారికి మాత్రమే ఇస్తున్నారని, మిగిలింది బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. జిల్లా పరిషత్ ఉప ఎన్నికల్లో కూటమి నామరూపాల్లేకుండా పోతుందని జోస్యం చెప్పారు.

ఇది సుపరిపాలన కాదు.. అరాచక పాలన: రఘురామిరెడ్డి

సుపరిపాలనకు తొలి అడుగు అంటూ కూటమి ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించడం హాస్యాస్పదమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వం చేసేవన్నీ అరాచకాలేనని విమర్శించారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల్లో గతంలో వైఎస్సార్‌సీపీ గెలిచిందని, కూటమి నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే వారు ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పి ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. జెడ్పీ ఉప ఎన్నిక పోలీసులకు అగ్ని పరీక్షలాంటిదన్నారు. ఈ ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించి పోలీసులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేనిపక్షంలో మీరు ఏదైతే చదువు చెప్తున్నారో రేపు అదే గిఫ్ట్‌గా వస్తుందని హెచ్చరించారు.

మాకు పోటీ టీడీపీ కాదు.. పోలీసులే: రాచమల్లు

జిల్లా పరిషత్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీపై పోటీ చేస్తున్నది టీడీపీ కాదని, పోలీసులేనని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. బ్యాలెట్ ద్వారా ఎన్నిక జరిగితే తామే విజయం సాధిస్తామన్నారు. ఉప ఎన్నికల సందర్భంగా ప్రచారం జరిగే ఐదు రోజుల్లో ఒక్క గొడవ గానీ, అవాంఛనీయ సంఘటనలు గానీ జరక్కుండా ఎన్నికలు జరిపితే పోలీసులను అభినందిస్తామన్నారు. ఏం జరిగినా వైఎస్సార్‌సీపీ నాయకుల పైనే కేసులు పెడితే మాత్రం మా ధర్మాన్ని మేం నిర్వర్తిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కడప పార్లమెంటు పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డి, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గురుమోహన్, నాగేంద్రారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.కిశోర్ కుమార్, బంగారు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉప ఎన్నికలపై కోర్ కమిటీలో చర్చ
త్వరలో జరగనున్న జిల్లా పరిషత్ ఉప ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమానికి కడప పార్లమెంటు పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డి, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు గురుమోహన్, కె.నాగేంద్రారెడ్డి, రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సోషల్‌వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మెన్ పులి సునీల్, దాసరి శివ, బంగారు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులకు బాధ్యతల అప్పగింత



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా ఇటీవల నియమితులైన ఎస్. గురుమోహన్, కె. నాగేంద్రారెడ్డి, ఆర్. వెంకట సుబ్బారెడ్డిలకు ఆ పార్టీ కడప పార్లమెంటు పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. గురుమోహన్‌కు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప అసెంబ్లీ నియోజకవర్గాలు, ఆర్. వెంకట సుబ్బారెడ్డికి కమలాపురం, బద్వేల్ నియోజకవర్గాలు, కె. నాగేంద్రారెడ్డికి పులివెందుల, జమ్మలమడుగు నియోజకవర్గాలను సమన్వయం చేసే బాధ్యతలు అప్పగించారు. వీరు రీజనల్ కో ఆర్డినేటర్లు, పరిశీలకులు, అసెంబ్లీ సమన్వయకర్తలను సమన్వయం చేయాలని సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, పి. సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. స్టూడెంట్ విభాగం అధ్యక్షులుగా కె.సుబ్బయ్య (డేవిడ్), ఎస్సీ విభాగం అధ్యక్షులుగా గజ్జెల కిరణ్, సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా ఎస్.చంద్రశేఖర్‌రెడ్డిలను నియమించారు.

రూ. 9 లక్షలు సామాజిక పెన్షన్ల నిధులు స్వాహా

సాక్షి టాస్క్‌ఫోర్స్ : దాదాపు రూ.9 లక్షల రూపాయల సామాజిక పెన్షన్ల నిధులను చింతకొమ్మదిన్నె సచివాలయంలో గతంలో పని చేసిన వెల్ఫేర్ కార్యదర్శి స్వాహా చేసినట్లు సమాచారం. ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ కోసం అందించిన సొమ్ములో మిగిలిన పైకాన్ని తిరిగి జమ చేయకుండా చాలా సంవత్సరాల పాటు స్వాహా చేసినట్లు తెలిసింది. గత ఏడాది చివరిలో నూతనంగా వచ్చిన పంచాయతీ అధికారి రికార్డులు పరిశీలించగా నిధుల స్వాహా విషయం బయటపడి సదరు అధికారి వెంటనే గత నవంబర్ లోనే ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా తెలిపారు .దీనిపై ఉన్నతాధికారులు విచారణ పేరుతో కాలం గడుపుతున్నారని సమాచారం. జిల్లా స్థాయి అధికారులకు కూడా నిధులు స్వాహా చేసిన ఉద్యోగి చేతులు తడపడంతో విచారణ నత్త నడకన సాగుతోందనే ఆరోపణలున్నాయి. సదరు ఉద్యోగి కేవలం ఒక లక్షా నలభై వేల రూపాయలు తిరిగి జమ చేసినట్లు, ఇంకా ఏడు లక్షల రూపాయలకు పైగా ప్రభుత్వ ధనం తిరిగి చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన బదిలీలలో ఆయన గోపవరం మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ విషయమై చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో విచారించగా పెన్షన్ల నిధులు స్వాహా విషయం వాస్తవమేనని, విచారణ జరుగుతోందని, మరికొందరి పై కూడా ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఎంపీడీఓ శిక్షణలో ఉన్నందున పూర్తి సమాచారం ఇవ్వలేమని తెలిపారు.

ప్రొద్దుటూరు పురపాలక సంఘము

నోటిఫికేషన్

రూల్ నం.169(3) & 169(4)(బి) ప్రకారం మరియు O/o DTCP, A.P. Lr.Roc No.17/08/2022-PLG-DOTCP, Dt. 13/09/2024 వారు ఇచ్చిన సర్కులర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు పురపాలక సంఘము లోని క్రింద తెలిపిన ఓల్డ్ బిల్ట్ అప్/ గ్రామకంఠము/ అగాడి ఏరియాలలో సర్కులేషన్ నెట్ వర్క్ ప్లాన్ లను తయారు చేయడం జరిగింది.

1. CP/RDP2025/PDTR/009 ఆఫ్ బంగారయ్య కొట్టాలు, వసంతపేట, టెలిఫోన్ కాలనీ, మిట్టమడి స్ట్రీట్
2. CP/RDP2025/PDTR/010 ఆఫ్ వెంకటేశ్వరపేట, గీతాశ్రమంరోడ్, సూపర్ బజార్ రోడ్, కాశహస్తయ్యగారి స్ట్రీట్
3. CP/RDP2025/PDTR/011 ఆఫ్ శ్రీరామ్ నగర్, దొరసానిపల్లి రోడ్డు
4. CP/RDP2025/PDTR/012 ఆఫ్ నడింపల్లి స్ట్రీట్, సుబ్బిరెడ్డి గారి స్ట్రీట్, గౌరమ్మ కట్ట స్ట్రీట్
5. CP/RDP2025/PDTR/013 ఆఫ్ మౌలానా ఆజాద్ స్ట్రీట్-1, సుందరాచార్యుల స్ట్రీట్, KIIM స్ట్రీట్
6. CP/RDP2025/PDTR/014 ఆఫ్ దేవాంగపేట, వినాయక నగర్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు
7. CP/RDP2025/PDTR/015 ఆఫ్ జిన్నా రోడ్, తిరుమలనాయుని పేట, నడింపల్లి స్ట్రీట్, మోడంపల్లి
8. CP/RDP2025/PDTR/016 ఆఫ్ శాంతకుమారి స్ట్రీట్, మట్టి మసీద్ స్ట్రీట్, రామేశ్వరం రోడ్డు
9. CP/RDP2025/PDTR/017 ఆఫ్ క్రిష్టియన్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, వసంతపేట హరిజనవాడ
10. CP/RDP2025/PDTR/018 ఆఫ్ వెంకటేశ్వర్ల పేట, కుమ్మర కొట్టాల, సూపర్ బజార్ రోడ్డు, గీతాశ్రమం రోడ్డు
11. CP/RDP2025/PDTR/019 ఆఫ్ మట్టి మసీద్ స్ట్రీట్, హైదర్ ఖాన్ రోడ్, జోకీపాలెం స్ట్రీట్
12. CP/RDP2025/PDTR/020 ఆఫ్ ఇందిరా నగర్, సరస్వతి విద్య మందిరం రోడ్డు
13. CP/RDP2025/PDTR/021 ఆఫ్ విజయనగరం స్ట్రీట్, సాంబయ్య గారి స్ట్రీట్, వినాయక నగర్, దేవంగపేట
14. CP/RDP2025/PDTR/022 ఆఫ్ గురువయ్య తోట, వసంతపేట, పవర్ హౌస్ రోడ్డు

ఇందుపై Go.Ms.No.4 of MA&UD(M), Dt. 09/01/2025 SECTION XIV in rule 169(1) sub rule (3) (b) అనుసరించి కమిషనర్ ప్రొద్దుటూరు పురపాలక సంఘము వారు సర్కులేషన్ నెట్ వర్క్ నమూనా ముసాయిదుకు ఆమోదం తెలిపియున్నారు. ఈ నోటిఫికేషన్ జారీ చేసిన తేది నుండి ప్రజల వద్ద నుండి వ్రాతపూర్వకంగా లేదా మెయిల్ ద్వారా పద్నాలుగు (14) రోజులలోపు సర్కులర్ నెట్ వర్క్ ప్లాన్ల సరళిని సూత్రప్రాయంగా ఆమోదించడం పై ఏమేని అభ్యంతరాలను మరియు సూచనలను కోరడమైనది.

Mail Id: tpsection.mplproddatur@gmail.com

చిరునామా: ప్రొద్దుటూరు పురపాలకసంఘము, గాంధీ రోడ్డు, వసంతపేట, ప్రొద్దుటూరు.

కమిషనర్ ప్రొద్దుటూరు పురపాలక సంఘము

ఫైర్ స్టేషన్లు పటిష్టం చేస్తాం

జోన్ -4 రీజినల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి



ఫైర్ ఆక్సిడెంట్ ఆర్పే ప్రయత్నాన్ని పరిశీలిస్తున్న రీజనల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి

కమలాపురం : జోన్-4 పరిధిలోని వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో అన్ని సౌకర్యాలు కల్పించి ఫైర్ స్టేషన్లను పటిష్టం చేస్తామని జోన్-4 రీజినల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి తెలిపారు. శనివారం వైఎస్సార్ కడప జిల్లా కమలాపురంలోని ఫైర్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఫైర్ ఎక్విప్‌మెంట్, ఫైర్ కాల్ వస్తే సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లే పద్ధతి, ఫైర్‌ను కంట్రోల్ చేసే పద్ధతులను డ్రిల్ చేయించారు. వాహనం, పరికరాలు నాణ్యత తదితర వాటిపై సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 252 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో జోన్‌లోని అన్ని ఫైర్ స్టేషన్లను ఆధునికీకరిస్తామన్నారు. ఫైర్ స్టేషన్లకు కావాల్సిన సౌకర్యాలను మెరుగు పరుస్తూ వాటిని పటిష్టం చేస్తామన్నారు. ఇప్పటికే తిరుపతి-2, ములకల చెరువు, శ్రీశైలం, నందికొట్కూరు, కళ్యాణదుర్గంలకు కొత్త ఫైర్ స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. శ్రీశైలం, నంది కొట్కూరులో స్లాబ్ లెవెల్ పనులు జరుగుతున్నాయని, మిగిలిన మూడు చోట్ల పనులు ప్రారంభిస్తామన్నారు. కడప, ప్రొద్దుటూరులో సెకండ్ ఫేజ్‌లో కొత్త భవనాలు నిర్మిస్తామన్నారు. వీలైతే థర్డ్ ఫేజ్‌లో కమలాపురంలో కూడా కొత్త భవనం నిర్మించే అవకాశం ఉందన్నారు. జమ్మలమడుగు, సూళ్లూరుపేట, వాల్మీకిపురంలో పెండింగ్‌లో ఉన్న భవనాల నిర్మాణాలను కూడా పూర్తి చేస్తామన్నారు. 110 కొత్త వాహనాల ఛాసిస్‌లు కొన్నామని, వాటిని ఫ్యాబ్రికేషన్‌కు పంపామన్నారు. 6 నెలల్లో పూర్తి అవుతాయని, మొత్తం స్టేషన్లకు కొత్త ఫైర్ వాహనాలు అందుబాటులోకి తెస్తామన్నారు. వైఎస్సార్ జిల్లా కలెక్టర్ 5 బోట్లు ఇచ్చారని, దీంతో కమలాపురం, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల ఫైర్ స్టేషన్లలో బోట్లు ఉన్నాయన్నారు. తిరుపతి జిల్లాలో 5 బోట్లు ఉన్నాయని, మిగిలిన జిల్లాల్లో ఒక్కొక్క బోటుమాత్రమే ఉందన్నారు. అయితే రిస్క్ జరిగినప్పుడు సిబ్బందితో పాటు బోట్లు కూడా ఆ ప్రాంతానికి తీసుకెళ్లి రిస్క్ ఆపరేషన్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. కాగా 15వ ఆర్థిక సంఘం నిధులతో రిస్క్ పరికరాలు కూడా కొనుగోలు చేసి ఫైర్ స్టేషన్లను అన్ని విధాలా పటిష్టం చేస్తామని ఆయన తెలిపారు. రిస్క్ చేసే ఫైర్ సిబ్బందికి అవార్డులు, రివార్డులు అందిస్తామని ఆయన తెలిపారు. ఇన్‌చార్జి ఎస్‌ఎఫ్‌ఓ జనార్దన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రలో చోరీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఇందిరమ్మ రాణి తోపు ఎదురుగా ఉన్న ఫిష్ ఆంధ్రలో దొంగలు పడ్డారు. గత కొంతకాలంగా ఫిష్ ఆంధ్ర తెరవకపోవడంతో ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు అద్దాలు పగులగొట్టి అందులోని మూడు ఏసీలను అపహరించారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఫిష్ ఆంధ్రలోని ఏసీలు చోరీకి గురయ్యాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విలువైన వస్తువులు చోరీకి గురి కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లారీని ఢీకొన్న వాహనం : ఇద్దరికి గాయాలు



గాయపడిన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

చింతకొమ్మదిన్నె : కడప- చిత్తూరు జాతీయ రహదారిపై జమాలపల్లె షెపర్డ్ పాఠశాల సమీపంలో శనివారం ఆగి ఉన్న లారీ (ఆర్‌జే 09జీఈ 0313)ని లక్కిరెడ్డిపల్లి నుంచి కడపకు మామిడి పండ్ల లోడుతో వస్తున్న బొలెరో పికప్ (ఏపీ04 యూఏ 1171) వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో పఠాన్ మౌలాలి(డ్రైవర్), నూర్ బీలు వాహనంలో ఇరుక్కుపోగా వారిని హైడ్రాలిక్ టూల్స్ సహాయంతో బయటికి తీసి హైవే పెట్రోలింగ్ పోలీసులు అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు



పెన్నానదిలో గజ ఈతగాళ్ల గాలింపు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిధిలోని పెన్నానదిలో గల్లంతైన గోపాల్ అనే యువకుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గూడెంచెరువు గ్రామంలో జరిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమంలో బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు వచ్చి పెన్నానదిలో షేక్ మున్నా, గోపాల్ అనే యువకులు గల్లంతైన విషయం విదితమే. షేక్ మున్నా మృతదేహం లభించగా గోపాల్ ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం రాత్రి 9 గంటల వరకు గజ ఈతగాళ్లు గాలించినా ఫలితం లేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు ఆపివేశారు. తిరిగి ఆదివారం గాలింపు చర్యలు కొనసాగిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

పీజీటీ టీచర్ల శిక్షణ విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు

కడప ఎడ్యుకేషన్ : కేజీబీవీలలో పనిచేస్తున్న పీజీటీ టీచర్లకు ఆదివారం నుంచి నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఏ. నిత్యానందరాజులు సూచించారు. శనివారం కడప సమగ్రశిక్ష కార్యాలయంలో రాయలసీమ పరిధిలోని కేజీబీవీలలో పనిచేసే ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ సబ్జెక్టు టీచర్లకు ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ఇన్ సరీ్వస్ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమంపై సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లకు సన్నద్ధత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ కడప నగర శివార్లలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రాయలసీమ పరిధిలోని కడప జిల్లాతోపాటు శ్రీ సత్యసాయి, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, కర్నూలు, నంద్యాల, నెల్లూరు జిల్లాలోని కేజీబీవీలలో పనిచేసే పీజీటీ సబ్జెక్టు టీచర్లందరూ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష కార్యాలయం సూపరింటెండెంట్ ప్రేమకుమారి, జీసీడీఓ దార్ల రూత్ ఆరోగ్యమేరీ, ఏఎంఓ వీరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయం కోసం చట్టపరమైన అవగాహన పెంచుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

కడప అర్బన్ : న్యాయ సహాయం కోసం చట్టపరమైన అవగాహన ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని అన్నారు.నల్సా (జాగృతి - అట్టడుగు స్థాయి సమాచారం, పారదర్శకత చొరవ కోసం న్యాయం అవగాహన) పథకం 2025 పై జిల్లా జాగృతి యూనిట్ సభ్యులకు శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమం శనివారం న్యాయసేవాసదన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ సహాయం పొందడంలో సవాళ్లు, న్యాయ సహాయం కోసం చట్టపరమైన అవగాహన, ప్రస్తుత చట్టపరమైన నిబంధనలు, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీన బాబు, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి శాంతి, 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జ్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, కడప డీఎస్పీ ఎ. వెంకటేశ్వర్లు, కడప అడిషనల్ మున్సిపల్ కమిషనర్ కె.రాకేష్ చంద్రం, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి, జిల్లా పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి బళ్లారి రాఘవ విశిష్ట సేవలు

జీఎస్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్ నీలమయ్య



బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీఎస్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్ నీలమయ్య

కడప సెవెన్‌రోడ్స్ : తెలుగు నాటక రంగానికి కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ విశిష్ట సేవలు అందించారని, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్ నీలమయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో స్టెప్, జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ 145వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నాటక రంగానికి ఎనలేని కృషి చేసిన బళ్లారి రాఘవ స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమన్నారు. ఆయన చిన్నతనం నుంచి కళలపై మక్కువ చూపించారన్నారు. న్యాయవాదిగా ఆయన చేసిన ప్రజా సేవకుగాను బ్రిటీష్ ప్రభుత్వం రావు బహదూర్ అనే బిరుదుతో సత్కరించిందన్నారు. ఆయన ఎక్కువగా సామాజిక నాటకాలను ప్రోత్సహించి సమాజంలో ఉన్న అసమానతలు, రుగ్మతలపై ప్రదర్శనలు నిర్వహించి నాటక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. మహిళలను కూడా ఆయన నాటక రంగంలో ప్రోత్సహించారన్నారు. ఇంగ్లాండ్,ఫ్రాన్స్ ,జర్మనీస్ స్విట్జర్లాండ్, శ్రీలంక వంటి దేశాలలో ఆయన నాటక ప్రదర్శనలు చేసి విదేశీయుల మన్ననలు పొందారన్నారు. 1936లో సినిమా రంగంలోకి ప్రవేశించి సామాజిక మార్పులపై సినిమాలు నిర్మించారన్నారు. దళితుల కోసం ఆయన రాత్రిపూట పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. కుల వివక్షతను తీవ్రంగా వ్యతిరేకించి సామాజిక సమానుత్వానికి పాటుపడ్డారని సాంప్రదాయ విలువలను గౌరవిస్తూ ఒక మార్గదర్శకుడుగా జీవించారన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాంతమ్మ, స్టెప్ సీఈఓ సాయి గ్రేస్, ఎల్‌డీఎం జనార్దన, జిల్లా టూరిజం మేనేజర్ రామ్ కుమార్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులకు అపార అవకాశాలు



పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ముఖద్వారం

పులివెందుల టౌన్ : బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయని పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ తెలిపారు. శనివారం స్థానిక ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ ప్రోగ్రాంలో చేరేందుకు ఫార్మర్స్ కోటా, నాన్ ఫార్మర్స్ కోటాలో బైపీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఈనెల 6వ తేదీ వరకు, ఎంపీసీ విద్యార్థుల నుంచి ఫార్మర్స్ కోటాలో దరఖాస్తులను ఈనెల 7వ తేదీవరకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విదాయలయం ద్వారా స్వీకరిస్తారన్నారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వెబ్ సైట్ నుంచి వివరాలు పొందవచ్చని తెలిపారు. పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు అందుబాటులో ఉందన్నారు. బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ ప్రోగ్రాంలో చేరేందుకు దరఖాస్తు చేసుకునేటప్పుడు పులివెందుల కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలను ఎంచుకోవాలని సూచించారు. గత ఏడాది ఈ కళాశాల నుంచి ఉత్తీర్ణులైన ఎక్కువమంది విద్యార్థులు వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలలో మంచి వేతనంతో ఉద్యోగాలు పొందారని, కొందరు దేశ, విదేశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ప్రోగ్రాంలో చేరారన్నారు. ఈ ఫుడ్ టెక్నాలజీ కోర్సు అభ్యసించిన వారికి ఆహార అనుబంధ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్(https://angrau. ac.in) చూడాలని కోరారు. పులివెందులలో ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ ప్రోగ్రాంలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు 9177776692 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై టీడీపీ నాయకుడి లైంగిక వేధింపులు

పీలేరు రూరల్ : ఫీల్డ్ అసిస్టెంట్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన టీడీపీ నాయకుడిపై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముడుపులవేముల పంచాయతీ దళితవాడకు చెందిన పల్లెపొగు రెడ్డికాంత భర్త 2024 జూలై 24న అనుమానాస్పద స్థితిలోమృతి చెందాడు. ఆమె గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అదే పంచాయతీ తాణావడ్డిపల్లెకు చెందిన యల్లమంద శ్రీనివాసులు ఏడాది కాలంగా తనను లైంగికంగా వేధిస్తున్నాడని బాధితురాలు శనివారం సీఐ యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు.

పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలికొదిలేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర విమర్శించారు. పట్టణంలోని ఎద్దులఈశ్వర్‌రెడ్డినగర్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాది డబుల్ ఇంజిన్ సర్కార్ అని డబ్బాలు కొట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దేశాన్ని, రాష్ట్రాన్ని కార్పొరేట్ వర్గాలకు తాకట్టుపెట్టే పనిలో ఉన్నాయని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలంతో పాటు భూమిలేని నిరుపేదలకు మూడెకరాలు చొప్పున వ్యవసాయ భూమిని మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఈ నెల 20 నుండి 25 వరకు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, జిల్లా సమితి సభ్యులు ఇమ్మానియేల్, బాలఓబయ్య, మస్తాన్, వెంకటరమణ, నాగరాజు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, రూరల్ నాయకులు నాగరాజు, సునీల్, ప్రసాద్, శాఖా కార్యదర్శులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో ముందస్తు సమాచారం లేకుండా పరీక్ష

ఆందోళన వ్యక్తం చేసిన విద్యార్థులు



ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వద్ద పహారా కాస్తున్న పోలీసులు, యూనివర్సిటీ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో గత కొద్ది రోజుల నుంచి నిత్యం ఏదో ఒక సమస్యపైన విద్యార్థులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం యూనివర్సిటీలో విద్యార్థులకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రెగ్యులర్ ఎగ్జామినేషన్ నిర్వహించారని అది కూడా ఒకే అమ్మాయికి నిర్వహించారని విద్యార్థులు ఆందోళన చేశారు. 60 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉన్నారని వారందరికి కాకుండా ఒక్క అమ్మాయికి మాత్రమే పరీక్ష ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఫణీంద్రారెడ్డిని వివరణ కోరాగా ఆ అమ్మాయి స్పెషల్ పర్మిషన్ తెచ్చుకుందని తెలిపారు. ఈ అమ్మాయికి ఈ నెల 5వ తేదీన యూకేకు సంబంధించిన ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఉందని అంతలోపు పరీక్షలు ముగించాలని ఆమె అనుమతి తెచ్చుకుందన్నారు. ఈ విషయమై విద్యార్థులకు నచ్చజెప్పినా వారు వినకపోవడంతో పోలీసులను పిలిపించాల్సి వచ్చిందని తెలిపారు. మిగతా విద్యార్థులకు కూడా త్వరలో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా రీజినల్ త్రోబాల్ పోటీలు



త్రోబాల్‌లో విజయం సాధించిన జట్లను అభినందిస్తున్న అధికారులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్థాయిలో నిర్వహించిన సీబీఎస్‌ఈ రీజినల్ త్రోబాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శనివారం ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప వేదికగా ప్రారంభమైన ఈ పోటీల్లో అండర్-14, అండర్-17, అండర్-19 బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ అమిత్ సింగ్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు. శ్రీనివాస్ మూర్తి, పాఠశాల రిజిస్ట్రార్ రహమతుల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.